బెంబేలెత్తిస్తున్న పందులు


వరాహగిరి కాలనీలో సంచరిస్తున్న పందులు


సింహగిరి కాలనీలో చెత్తను తింటున్న పందులు


సింహగిరి కాలనీ డ్రైనేజీలో పందుల గుంపు

- 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో స్వైరవిహారం
- పాడవుతున్న పరిసరాలు
- నివాసుల్లో భయాందోళనలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో నివాసులను పందులు బెంబేలెత్తిస్తున్నాయి. సింగాలమ్మపురం, సింహగిరి కాలనీ, సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ-1, 2 ప్రాంతాల్లో ఎప్పుడు చూసినా పందులు హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని భారీ ఆకారంతో పిల్లలను భయపెడుతున్నాయి. ఏ సమయంలో పిల్లల మీద దాడి చేస్తాయోనని తల్లిదండ్రులు నిత్యం భయాందోళనలు వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ఎక్కువగా మొక్కలు, చెట్లు ఉండటం వల్ల పందులను వాటి యజమానులు తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారని వారు చెబుతున్నారు. పందుల రాక కోసం వీలుగా ఇక్కడి వేంకటేశ్వర స్వామి ఆలయం గోడకు రంధ్రం చేసి లోపలికి వదిలేస్తున్నారన్నారు.

చెత్తను చెల్లాచెదురు చేస్తూ..

జీవీఎంసీ సిబ్బంది కొండపై ప్రాంతాల నుంచి ప్రతి రోజు ఇంటింటా సేకరించి తీసుకొచ్చిన చెత్తను ఆటో వచ్చే వరకు కింద ఉంచుతారు. ఇలా పోగేసిన చెత్తను జీవీఎంసీ సిబ్బంది వెళ్లిపోగానే.. ఆటో వచ్చేలోగానే పందులు కింద పడేసి చిందరవందర చేస్తున్నాయి. అసలే వ్యాధులు ప్రబలుతున్న కాలం.. ఇటువంటి సమయంలో పందుల స్వైరవిహారం వల్ల ఏమేం జబ్బులు వస్తాయోనని స్థానికులు మరింత భయపడుతున్నారు. సంబంధిత అధికారుల స్పందించి పందుల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని కొండవాలు ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

ప్రతి రోజూ ఇబ్బందులు

పందులతో ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నాం. గుంపుగా రోడ్డు మీదకి వచ్చి ఇంటింటా సేకరించిన చెత్తను తినడం, కింద పారేయడం చేస్తున్నాయి. దీని వల్ల దుర్గంధంతోపాటు పరిసరాలు భయంకరంగా మారుతున్నాయి. సంబంధి అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– టి.యర్రయ్య, వరాహగిరి కాలనీ

అధికారులు చర్యలు చేపట్టాలి

జీవీఎంసీ సిబ్బంది కొండపైన ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను కింద ఉంచుతున్నారు. పందులు వీటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. పక్కనే ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రహరీకి రంధ్రం చేసి మరీ వీటిని లోపల ఉంచుతున్నారు. గుబురుగా ఉన్న పొదల్లో యజమానులు వీటిని పెంచుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలి.

– సన్యాసప్పలనాయుడు, సింహగిరి కాలనీ

జగన్ బాబు పాలనలో సంతోషంగా ప్రజలు


పథకాలు అందుతున్న తీరుపై కస్తూరినగర్‌లో మహాలక్ష్మితో మాట్లాడుతున్న కె.కె.రాజు


46వ వార్డులో పర్యటిస్తున్న కె.కె.రాజు, సతీష్

- ముఖ్యమంత్రి పరిపాలనపై కస్తూరినగర్ మహిళ హర్షం
- 46వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కంచరపాలెం: 'జగన్ బాబు పరిపాలన చాలా బాగుంది. కన్నబిడ్డల కంటే బాగా చూసుకుంటున్నాడు. మాలాంటి వారికి ఆసరాగా.. చేయూతగా ఉంటున్నాడు. సొంతవారిని చూసుకుంటున్నట్టే మమ్మల్ని చూసుకుంటున్నారు. దీంతో పిల్లల దగ్గర విలువ, గౌరవం పెరిగాయి. జగన్ బాబు పరిపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. అర్హులందరికీ అన్ని పథకాలు అందుతున్నాయి. వైఎస్సార్ చేయూత, పెన్షన్, డ్వాక్రా రుణమాఫీ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు సక్రమంగా వస్తున్నాయి' అని కస్తూరినగర్-1 నివాసి చీపురుపల్లి మహాలక్ష్మి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై హర్షం వ్యక్తం చేసి ఆశీర్వదించింది. 46వ వార్డు కస్తూరినగర్-1లో గురువారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఓ గడపలో చీపురుపల్లి మహాలక్ష్మి అనే మహిళ పైవిధంగా స్పందించి సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న పథకాలతో సంతోషంగా జీవిస్తున్నట్లు తెలిపింది.

జగనన్నకు ప్రజలందరి దీవెనలు..

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆసరాగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గడప గడపలో ప్రజలు దీవిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఆయనే సీఎం కావాలని ప్రజలు కోరుకోవడం హర్షణీయమన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు అప్పారావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, నాయకులు గోవింద్, చిన్నారావు, నరిసింగరావు, సోమునాయుడు, సీతయ్యరెడ్డి, ఈశ్వరరావు, దుర్గాభవాని కె.శ్రీను, రమణ, రామారావు, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి రమణారెడ్డి, దేవి, విజయ, లక్ష్మి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లయన్స్ క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.లక్ష విరాళం


ఉమామహేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న దాత సత్యవేణి

సీతమ్మధార: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని లయన్స్ క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధికి మడపాక సత్యవేణి లక్ష రూపాయలు విరాళంగా అందించారు. హాస్పిటల్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావుకు విరాళ చెక్కును దాత అందజేశారు. ఈ సందర్భంగా సత్యవేణికి ఆయన అభినందనలు తెలిపారు.

లలితా పీఠంలో చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో చైత్ర మాసం బహుళ అష్టమి సందర్భంగా గురువారం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం కాలభైరవ హోమం జరిపించారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

కాలభైరవుడికి ప్రత్యేక అభిషేకాలు


కాలభైరవుడికి పూజలు చేస్తున్న రాజాస్వామి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన కాలభైరవుడికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బహుళ అష్టమి సందర్భంగా భైరవుడికి పంచామృతాభిషేకం, భక్తుల నామగోత్రాలతో పూజలు చేశారు. గుమ్మడికాయలో నెయ్యి దీపాలను వెలిగించారు. అర్చకుడు వంశీ, సిబ్బంది శివ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్ఈసీఎస్‌లో భారీ కుంభకోణం

సీతంపేట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం ఆర్ఈసీఎస్‌లో రూ.700 కోట్ల భారీ కుంభకోణం జరిగినట్టు జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపీనాథ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఈసీఎస్ అవినీతిని బహిర్గతం చేస్తూ కమిషన్ చైర్మన్ 33 పేజీల రిపోర్ట్ విడుదల చేశారన్నారు. ఈపీడీసీఎల్, ఆర్ఈసీఎస్ పనితీరులో, కలెక్షన్స్, ఖర్చులో భారీ వ్యత్యాసం ఉన్నట్టు చెప్పారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు రాందాస్, గోవిందరావు, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, తాకసి సత్యం దొర, అప్పికొండ గణేష్, గంగుపాం జగదీష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ రాయబారం పద్యనాటక ప్రదర్శన నేడు

మద్రిపాలెం: హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కైలాసపురం సీతారామ కల్యాణ మండపంలో శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. మాధవధారలోని కార్యాలయంలో గురువారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్ట్ ఆర్థిక సాయంతో సాయంత్రం 6.30 గంటలకు ఈ నాటకం వేస్తున్నట్టు పేర్కొన్నారు.

కార్యక్రమానికి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, బీసీహెచ్ మసేన్, దాడి సత్యనారాయణ హాజరవుతారని చెప్పారు. అనంతరం రంగస్థల నటుడు ఎస్.కె.మిశ్రోను సన్మానిస్తామన్నారు. పోర్టు ఉద్యోగులు, డీఎల్‌బీ ఉద్యోగులు, పెన్షనర్లు, కళాకారులు, కళాభిమానులు అంతా కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆధునిక సాంకేతికతపై శిక్షణ పూర్తి


శాంసంగ్ ఇండియా ప్రతినిధులతో బుల్లయ్య కళాశాల యాజమాన్యం, ఏసీపీ శిరీష

సీతంపేట: యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర అభ్యాస అవకాశాలను అందించడానికి భారత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న శాంసంగ్ ఇండియా.. బుల్లయ్య కళాశాలను ఎంపిక చేయడం గర్వించదగ్గ విషయమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అన్నారు. శాంసంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా బుల్లయ్య కాలేజీలో ఫోర్త్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ బిగ్ డేటా ప్రోగ్రామ్స్‌పై మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ శిరీష మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించుకుని దిశ యాప్ వంటి మహిళల భద్రత కోసం కొత్త యాప్‌లను రూపొందించడానికి యువత కృషి చేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు చీఫ్ మేనేజర్ సీఎస్ఆర్ శైలజ పతానియ, కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్‌చౌదరి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఉపాధి కల్పనకు చర్యలు


ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తితో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

మురళీనగర్: స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. స్కిల్ హబ్స్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణలో భాగంగా గత జనవరిలో నిర్వహించిన కుట్టు యంత్రం ఆపరేటర్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన అంశాలను సాధన చేసి మరింత స్కిల్‌ను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా 26 మంది మహిళలకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి అందించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగం హెడ్ కె.డి.వి.నరసింహారావు, ఏపీఎస్ఎస్‌డీసీ అసోసియేట్ మేనేజర్ బి.కార్తీక్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ ఎస్.కమలాకర్, ట్రైనర్ పి.ప్రసన్నకుమారి, కో ఆర్డినేటర్ టి.లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి 'ప్రచార భేరి'

మురళీనగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు 'నరేంద్ర మోదీ హటావో.. దేశ్‌కీ బచావో' అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం సీపీఐ నాయకులు కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాత్రపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాధవధార 48వ బస్ స్టాప్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరపత్రాలు, వివిధ కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరిచేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి రోజైన ఈ నెల 14న ప్రచార భేరి ప్రారంభించి 30వ తేదీ వరకు నిర్వహిస్తామని, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఉత్తర నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎస్.నాగభూషణరావు, జిల్లా నాయకులు ఎస్.బాబు, మాధవధార డివిజన్ కార్యదర్శి ఎస్.రాంగోపాల్, సంతోష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ప్రోత్సాహం


స్టాల్ ప్రారంభిస్తున్న నాబార్డ్ ఏపీ డీజీఎం ప్రసాద్

దాబాగార్డెన్స్: గ్రామీణ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణాల్లో విక్రయించి, వారిని ప్రోత్సహించడమే నాబార్డ్ లక్ష్యంగా పనిచేస్తోందని నాబార్డ్ ఏపీ డీజీఎం కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఇన్ మాల్ పేరిట పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి అందుబాటు ధరలకే విక్రయిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ఓ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 12 వరకు హస్త కళాకారుల ఉత్పత్తుల విక్రయాలు జరుగుతాయని తెలిపారు. హస్త కళాకారులకు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. మహా విశాఖ ప్రజలు హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. నాబార్డ్ విశాఖ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, నేస్తం ఎన్జీవో సంస్థ సురేష్ మాట్లాడుతూ ఈ స్టాల్స్‌లో హస్త కళాకారులు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు లభిస్తాయన్నారు.

సాగర తీరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్

బీచ్ రోడ్డు: సాగర తీరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ అడిషనల్ డీజీపీ(అగ్నిమాపక) పి.వి.సునీల్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శమన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడంలో అంబేడ్కర్ పాత్ర కీలకమైందన్నారు. అంబేడ్కర్‌ను ఒక్క వర్గానికే పరిమితం చేయడం తగదన్నారు. ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, రొయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'


14వ వార్డులో సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు


49వ వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు


చెక్కుడురాయి బిల్డింగ్ వద్ద మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతమ్మధార: నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. జీవీఎంసీ 14వ వార్డులో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్ తదితర ప్రాంతాల్లో ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, స్టిక్కర్లు అందించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకుడు బల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

49వ వార్డులో విశేష స్పందన

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. 280 సచివాలయం కన్వీనర్, గృహసారథులతో కలిసి సూర్యనగర్-1, సత్యనగర్-1 ఏరియాల్లోని 16, 17, 19, 20, 21 క్లస్టర్లలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇంటి తలుపులు, వాహనాలపై నివాసుల అనుమతితో శంకరరావు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సచివాలయం కన్వీనర్ అయినింటి రవికుమార్, శివాలయం బోర్డు ధర్మకర్తలు సీహెచ్.శ్యామల, ఎం.వెంకటలక్ష్మి, వి.వరలక్ష్మి, గృహసారథులు ఎస్.పాండు రంగా, ఆర్.వరలక్ష్మి, ఎస్.సంతోషి, ఎస్.వెంకటలక్ష్మి, కె.ఉషారాణి, ఎం.వెంకటలక్ష్మి, బి.గౌరి, ఐ.పూర్ణ, ఐ.పావని, వలంటీర్లు చైతన్య, ప్రవేశిక, బాబి, వెంకటలక్ష్మి, ఐ.జగదీష్, కె.అరుణ్, ఎం.శ్యామ్, సురేష్ పాల్గొన్నారు.

43వ వార్డులో..

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు 246 సచివాలయం పరిధి చెక్కుడురాయి బిల్డింగ్ వద్ద కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. నాలుగుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తున్న జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించి మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. మద్దతు తెలిపిన వారి ఇంటికి స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు అందజేశారు.

25వ వార్డులో..

జీవీఎంసీ 25వ వార్డు 132 సచివాలయం పరిధిలో కన్వీనర్లు రావాడ వీరమ్మ, డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రజా మద్దతు ఫారంలోని ప్రశ్నలకు సమాధానాలను అడిగి తెలుసుకున్నారు. గృహసారథులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 255, 256 సచివాలయాల పరిధిలోని ప్రశాంతినగర్, వీర టవర్స్, లక్ష్మీనారాయణపురం-2 ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు జి.వి.ఎస్.ఎస్.ఆర్.హరిపట్నాయక్, జి.శ్రీనివాసరావు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలన, సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాలు సేకరించారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు

మురళీనగర్: వివిధ సర్టిఫికెట్ కోర్సులు చేసిన విద్యార్థులకు నిర్వహిస్తున్న సీసీఐసీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లాలోని వివిధ సంస్థల ద్వారా ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ గార్మెంట్స్ మేకింగ్, ఆఫీస్ ఆటోమేషన్, ఆటో క్యాడ్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సులు చేసిన వారికి ఈ నెల 10 నుంచి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న ఫైనల్ పరీక్షలు ముగిసినట్లు ప్రిన్సిపాల్ జి.వి.వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నాలుగు రోజుల పాటు ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు 5,026 మందిని కేటాయించగా 4,637 మంది హాజరయ్యారని చెప్పారు.

చేతి వృత్తుల్లో మహిళలకు ఉచిత శిక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలతో అరుణకుమారి, శోభారాణి, గోపీకృష్ణ

సీతంపేట: మహిళలు స్వశక్తితో జీవించే విధంగా మానసిక చైతన్యాన్ని పెంపొందించడం, వివిధ వృత్తి కళలు నేర్పించి స్వయం ఉపాధి కల్పించడంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ముందంజలో ఉందని ప్రధాన మోటివేటర్ టి.అరుణకుమారి అన్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని నిరంజన్ మెడిటేషన్ సెంటర్‌లో గురువారం చర్మ, శిరోజాల సంరక్షణపై మహిళలకు అవగాహన కల్పిస్తూ బ్యూటీషియన్ శోభారాణిచే ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, వివిధ చేతి వృత్తుల్లో మహిళలకు శిక్షణ, మహిళా సాధికారత, బాలిక సంరక్షణ వంటి అనేక అంశాలపై తమ సెంటర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తద్వారా మహిళల జీవితాల్లో వెలుగు రేఖలు నింపుతున్నామన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న భారత్ నిధి సంస్థ వ్యవస్థాపకుడు డబ్బీరు గోపీకృష్ణ తగు రీతిలో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. శిక్షణలో భాగంగా శారదావల్లి, పలువురు విద్యార్థులు, మెడిటేషన్, యోగా టీచర్లు ఆరోగ్యంగా అందంగా కనపడటానికి పలు చిట్కాలు తెలియజేశారు. శిక్షణలో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన

సీతంపేట: వారం రోజులు దాటి నీరు నిల్వ ఉంటే డెంగ్యూ, మలేరియా జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు పెరుగుతాయని జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది సుధాకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. 25వ వార్డు గణేష్‌నగర్‌లో గురువారం దోమల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒక రోజు డ్రై డే పాటించి నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు శుభ్రపరిచి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, దోమ కాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి కరపత్రాలు పంచారు.

ధ్యాన మందిరంలో చలివేంద్రం ప్రారంభం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిర ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం దీనిని ముఖ్య అతిథులు పిట్టా గురుమూర్తిరెడ్డి, మల్లిక ప్రారంభించారు. తొలి రోజు చాపా శ్రీనివాసరావు సహాయంతో బాటసారులు, భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు బన్నా రామారావు, భూపతిరాజు వెంకటరామాంజనేయ రాజు, గురిజా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబాకు పూజలు


సాయిబాబాకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ దంపతులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ఆళ్ల శ్రీనివాస్ దంపతులు సాక్షిగణపతి ఆలయం వీధిలోని తమ నివాసంలో గురువారం షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని బాబాకు భక్తిశ్రద్ధలతో పూజలు, భజన కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, శశికళ, ఉరుకూటి నారాయణరావుతో పాటు అధిక సంఖ్యలో సాయిభక్తులు, స్థానికులు పాల్గొన్నారు.